క్లుప్తంగా

శాస్త్రోక్తంగా హోమాలు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో నూకాలమ్మ అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాలను పురస్కరించుకుని శనివారం వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించారు. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నవ దుర్గ సహిత వనదుర్గా హోమం, జీవ కళా వ్యాస హోమం, చండీ హోమం, రుద్ర లక్ష్మీ హోమం నిర్వహించారు. అమ్మవారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన, క్షీరాభిషేకం చేశారు.

నేడు అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ

అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 10.42 గంటలకు యంత్ర విగ్రహ ప్రతిష్ఠ, 11.41 గంటలకు శిఖర ప్రతిష్ఠ నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా, లక్ష్మీ చైతన్య దంపతులు అమ్మవారి విగ్రహ, ఆలయ శిఖర ప్రతిష్ఠ చేస్తారని చెప్పారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్ఓ శ్రీనివాసరావు

జగ్గంపేట: వచ్చే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులు సహకరించాలని జగ్గంపేట నియోజకవర్గ ఈఆర్ఓ ఎం.శ్రీనివాసరావు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం రాజకీయ పార్టీల నేతలు, ఎన్నికల సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీల సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఎన్నికల సిబ్బంది విధులు, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, టీడీపీ నేత బుర్రి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బీసీ యువజన ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్



లక్ష్మణ్‌ను అభినందిస్తున్న కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన దేవ లక్ష్మణ్ వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ తనకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. లక్ష్మణ్‌కు వరుపుల సుబ్బారావు, పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



మృతుడు అప్పారావు

కోటనందూరు: మండలంలోని భీమవరపుకోటలో శనివారం గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. భీమవరపుకోట గ్రామానికి చెందిన పుర్రే అప్పారావు(62) ఉపాధి కూలీ. రోజూ మాదిగానే శనివారం ఉదయమే ఉపాధి పని ప్రాంతానికి వెళ్లాడు. కొంత సమయం పని చేసిన తరువాత ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. సహచర కూలీలు 108 వాహనంలో హుటాహుటిన తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గ్రామ సర్పంచ్ జిగటాల వీరబాబు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

21 నుంచి బీజేపీ ప్రజాపోరు

ప్రత్తిపాడు: రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 21 నుంచి 29 వరకూ తొమ్మిది రోజుల పాటు అన్ని నియోజకవర్గాల్లో ప్రచారరథాలతో ప్రజాపోరు కార్యక్రమం నిర్వహించనున్నట్టు నియోజకవర్గ ప్రజాపోరు కన్వీనర్ గట్టిం వెంకటరమణ తెలిపారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శనివారం సాయంత్రం జరిగిన నియోజకవర్గ స్థాయి బీజేపీ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపోరు ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తామన్నారు. అయోధ్య రామమందిర నిర్మాణంతో ప్రధాని మోదీకి ప్రజల్లో ఆదరణ పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపోరు జిల్లా కన్వీనర్ ఘంటా బాలుదొర, కో కన్వీనర్ కొల్లా శ్రీనివాస్, బీజేపీ వివిధ విభాగాల నాయకులు దాకే కృష్ణారావు, కించు జోగిరాజు, రెడ్డి వరలక్ష్మి పాల్గొన్నారు.

ఊరు మారి.. కష్టాలు తీరి..

- కొత్త పంచాయతీగా లోవకొత్తూరు
- సొంతూరులో ప్రభుత్వ సేవలు
- నాలుగున్నరేళ్లలో రూ.32.69 కోట్ల మేర లబ్ధి
- ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

తుని రూరల్: మండలంలోని లోవ కొత్తూరు గ్రామస్తులు కష్టాలు తీరాయి. లోవకొత్తూరు వాసులు గతంలో ఏ పని చేయించుకోవాలన్నా కిలో మీటరు దూరంలో ఉన్న వెలమ కొత్తూరు పంచాయతీ కార్యాలయానికి గాని, నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. లోవకొత్తూరు ఊరు పూర్తిగా మారిపోయింది. ఉన్న ఊర్లోనే గ్రామ సచివాలయంలో ప్రభుత్వం సేవలు, వ్యవసాయ సంబంధిత సేవలు, వైద్య సేవలు, రక్షిత తాగునీరు అందించే ఓవర్ హెడ్ ట్యాంకులు, ఇంటింటా కుళాయి కనెక్షన్లు, సిమెంట్ కాలువలు, రోడ్లను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా గ్రామ పరిపాలనకు అనువుగా లోవకొత్తూరు పంచాయతీ కొత్తగా ఏర్పాటైంది. దీంతో ఉన్న ఊరిలోనే ప్రభుత్వ సేవలతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు లభిస్తుండడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా దక్షతతోనే తమ ఊరు తీరు మారిందని గ్రామస్తులు చెబుతున్నారు.

గత నాలుగున్నరేళ్లలో...

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత లోవకొత్తూరు గ్రామస్తులకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల రూపంలో రూ.32.69 కోట్ల మేర లబ్ధి చేకూరింది. ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా రూ.19.85 కోట్లు, పరోక్షంగా నగదు బదిలీ (డీబీటీ) ద్వారా రూ.9.22 కోట్లు, గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, మనబడి నాడు-నేడు, 300 మీటర్లు సీసీ రోడ్లు, 685 మీటర్లు సీసీ కాలువలు, రెండు వాటర్ ట్యాంకులు, 793 ఇళ్లకు కుళాయి కనెక్షన్లకు రూ.3.62 కోట్లు ప్రయోజనం చేకూరింది. 191 కుటుంబాలకు సొంతింటి కల నెరవేరింది.



లోవకొత్తూరులో-బీఆర్ అంబేడ్కర్ ఆశ్రమ పాఠశాల మధ్య నిర్మించిన సిమెంట్ రోడ్డు



లోవకొత్తూరులో ఇటీవల నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు

తొలి సర్పంచ్‌గా సేవలు



వెలమ కొత్తూరులో అంతర్భాగంగా ఉన్న లోవకొత్తూరు ప్రత్యేక పంచాయతీగా ఏర్పడింది. తొలి సర్పంచ్‌గా ఎన్నికైన నాకు ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కింది. రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో గ్రామంలో ప్రభుత్వం కార్యాలయాలు, రోడ్లు, కాలువలు, రెండు వాటర్ ట్యాంకు, ఇంటింటా కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేశాం. ప్రస్తుతం గ్రామం రూపురేఖలు పూర్తిగా మారడంతో ఆనందంగా ఉంది.

– లంక వెంకటలక్ష్మి, సర్పంచ్, లోవకొత్తూరు

ఉన్న ఊర్లోనే ప్రభుత్వం సేవలు



సచివాలయ వ్యవస్థతో గ్రామంలోనే ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ముందు ఏ చిన్న పనికైన పంచాయతీ కేంద్రానికి, మండల కేంద్రానికి రోజువారి పనులు మానుకుని వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు సొంత గ్రామంలోనే అన్ని ప్రభుత్వం పనులు జరిగిపోతున్నాయి . వృద్ధులకు, దివ్యాంగులకు, యువతకు సచివాలయ వ్యవస్థతో శ్రమ, దూరాభారం తగ్గింది.

– గుత్తుర్తి పద్మ, ఎంపీటీసీ, లోవకొత్తూరు

మంత్రి రాజాను కలసిన పంచాయతీ కార్యదర్శులు



తునిలో మంత్రి దాడిశెట్టి రాజాను కలసిన గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు

తుని: మండలంలోని ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజాను గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. వన్ పంచాయతీ-వన్ సెక్రటరీ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం జీవో నంబర్ 11 విడుదల చేసినందుకు గాను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి దాడిశెట్టి రాజాలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహంతో ప్రజలకు మెరుగైన సేవలందించాలని మంత్రి రాజా కార్యదర్శులకు సూచించారు.

రైలు నుంచి జారి పడి యువకుడి మృతి

తుని: రైలు నుంచి జారి పడి యువకుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక రైల్వే ఎస్సై ఎస్కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. తుని-గొల్లప్రోలు రైల్వే స్టేషన్ల మధ్య సుమారు 30 ఏళ్ల వయసు గల యువకుడు గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి మృతి చెందాడన్నారు. అతని వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు. ఆచూకీ తెలిసిన వారు 94948 87786కు సమాచారం ఇవ్వాలని కోరారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



శంఖవరంలో వలంటీర్లను సత్కరించిన కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- శంఖవరంలో వలంటీర్లకు సత్కారం

శంఖవరం: గ్రామ వలంటీర్లు ప్రజలకు చేస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ పర్వత రాజబాబు అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఐదుగురు వలంటీర్లకు సేవారత్న పురస్కారానికి, 262 మంది సేవా మిత్ర పురస్కారానికి ఎంపికయ్యారు. వారందరికీ కో ఆర్డినేటర్ సుబ్బారావు ప్రశంసా పత్రాలు అంద జేసి, శాలువా సత్కరించారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వానికి-ప్రజలకు వారధిగా వలంటీర్లు పని చేస్తున్నారన్నారు. వలంటీర్లపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టారన్నారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రతిఒక్కరూ కష్టించి పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు ఈగల విజయదుర్గ, నకురు గుర్రాజు, దూడల రామస్వామి, రాంశెట్టి ఏసుబాబు, నరాల తాతబ్బాయి, ఎంపీటీసీ దడాల సతీష్, కో ఆప్షన్ సభ్యుడు గాబు కృష్ణ, పార్టీ నాయకులు యెడ్ల సత్యనారాయణ, ఈగల రాజు, కోన బాబ్జి, ఈగల గంగ, వెలుగుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం



సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు

ఏలేశ్వరం: పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పట్టణంలో చేపట్టే అభివృద్ధి పనులను కొందరి కాంట్రాక్టర్లకే అప్పగిస్తున్నారని, వారి అలసత్వం కారణంగా పనులకు ఆటంకం కలుగుతోందని కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు అభ్యంతరం తెలిపారు. కొత్త కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తే సకాలంలో పూర్తవుతాయన్నారు. అజెండాలో తాగునీటి కోసం కొత్త మోటర్ల కొనుగోలుకు తీర్మానంలో పెట్టారని, ఎన్నిసార్లు పెడతారని ప్రశ్నించారు. కమిషనర్ శివప్రసాద్ మాట్లాడుతూ ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పలు అభివృద్ధి పనులను ఆమోదించారు. తొలుత అధికారులు అజెండాలో అంశాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ మసిరపు బుజ్జి, సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



ఏలేశ్వరం జగనన్న కాలనీలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్ శివప్రసాద్

ఏలేశ్వరం: పట్టణంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.శివప్రసాద్ సూచించారు. హౌసింగ్ డేను పురస్కరించుకుని శనివారం పట్టణంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. సచివాలయ, హౌసింగ్ సిబ్బంది, లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న కాలనీల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఖాతాదారులతో సక్రమంగా వ్యవహరించండి



శంఖవరంలో ఎస్‌బీఐ మేనేజర్‌తో మాట్లాడుతున్న ఎంపీపీ పర్వత రాజబాబు

శంఖవరం: ఖాతాదారుల పట్ల స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది సక్రమంగా వ్యవహరించాలని ఎంపీపీ పర్వత రాజబాబు సూచించారు. స్థానిక స్టేట్ బ్యాంక్ మేనేజర్ సునీల్ కుమార్ బ్యాంక్‌కు వచ్చే వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఖాతాదారులు ఎంపీపీ పర్వత రాజబాబుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం ఎంపీపీ పర్వత రాజబాబు మేనేజర్‌ను కలిసి పలు సూచనలు చేశారు. బ్యాంక్‌కు వచ్చే ఖాతాదారులతో అసభ్యంగా ప్రవర్తించడం తగదన్నారు. ఖాతాదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పర్వత వివేక్, పడాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష మోదక హవన యాగం



మహాకాళీ శక్తిపీఠంలో లక్ష మోదక హవన యాగం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై గోశాల వద్ద ఉన్న మహాకాళీ శక్తిపీఠంలో ఉచ్చిష్ట గణపతికి లోక కల్యాణార్థం లక్ష మోదక (ఉండ్రాళ్ల) హవన యాగం నిర్వహిస్తున్నారు. మాఘ శుద్ధ పాడ్యమి నాడు ఈ యాగాన్ని ప్రారంభించినట్టు యాగం నిర్వాహకులు నాగాభట్ల రవిశర్మ శనివారం తెలిపారు. ప్రతిరోజూ పదివేల ఉండ్రాళ్లను హోమగుండంలో సమర్పిస్తున్నామన్నారు. గత తొమ్మిదేళ్లుగా ఏటా మాఘమాసంలో ఈ యాగం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 20న భీష్మ ఏకాదశి పురస్కరించుకుని పూర్ణాహుతి నిర్వహిస్తామని చెప్పారు. సుమారు పది మంది రుత్విక్కులు యాగం నిర్వహిస్తుండగా మరో పది మంది ఉండ్రాళ్ల తయారీలో పాల్గొంటున్నారు. ఆసక్తి కలిగిన భక్తులు యాగం పూర్ణాహుతిలో పాల్గొనాలని రవిశర్మ కోరారు.

వైఎస్సార్ సీపీ మండల కమిటీల ఏర్పాటు

తుని: వైఎస్సార్ సీపీ మండల కమిటీలను ఏర్పాటు చేసినట్టు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఈ మేరకు శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు అందాయని చెప్పారు.

కోటనందూరు మండల కమిటీ

వైఎస్సార్ సీపీ కోటనందూరు మండలాధ్యక్షుడిగా చింతకాయల చినబాబు, ఉపాధ్యక్షులుగా కుంచే అచ్చిరాజు, అనుకుల రిచర్డ్ శామ్యూల్, జనరల్ సెక్రటరీలుగా కీర్తి గణేశ్వరబాబ్జీ, కరక అప్పలనాయుడు, మిరియాల అప్పారావు, సెక్రటరీలుగా పెనుముచ్చు నరసింగరావు, తోలెం రాజులు, రెడ్డి భారతి, అన్నంరెడ్డి గంగునాయుడు, కురపాకల లవప్రసాద్, ట్రెజరర్‌గా దొడ్డి బాబ్జీ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మాసా కృష్ణ, వేగి సూర్యనారాయణ, వెంతూరి నూకరాజు, పైల వెంకటరమణమూర్తి, కీర్తి అప్పారావు, కర్రి బాబూరావు, గుడివాడ రాంబాబు, అల్లు కాశీనాయుడు, కురందాసు రాంబాబు, నల్లమిల్లి సూర్య వెంకటరమణ, నేతల లక్ష్మి, పడాల సూర్యనారాయణ, నేతల శివ, ఫక్కుర్తి అప్పలరాజు, పలక పద్మ నియమితులయ్యారు.

తొండంగి మండలాధ్యక్షుడిగా నూకరాజు

వైఎస్సార్ సీపీ తొండంగి మండలాధ్యక్షుడిగా బుద్ది నూకరాజు, ఉపాధ్యక్షులుగా చొక్కా రామచంద్రరావు, మేడిశెట్టి దొరబాబు, జనరల్ సెక్రటరీలుగా సిద్దా శ్రీనివాసరావు, మాడికి వెంకటలక్ష్మి, దాదాల విజయ్‌కుమార్, సెక్రటరీలుగా కాశిందేవుల అమ్మాజీ, పెదపాటి నాగమణి, బోడపాటి రాణి, కింతాడ పాపారావు, నక్కా అనంతలక్ష్మి, ట్రెజరర్‌గా బస్సా గంగాధర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా యడ్ల కృష్ణ, పెనుమత్స కృష్ణంరాజు, పగడాల నానాజీ, అంబుజాలపు సత్యనారాయణ, అత్తి మల్లేశ్వరరావు, ధారా అప్పన్న, ఎలుగుబంటి రామకృష్ణ, మేడిశెట్టి వెంకటేశ్వరరావు, కటారి స్వరూప్, సింగిరి సింగారావు, దూలం బాబూరావు, అంగులూరి శ్రీను, అంబుజాలపు నాగేంద్ర, పెదిరెడ్ల గంగ, లంక సత్యవతి నియమితులయ్యారు.

తుని మండలాధ్యక్షుడిగా నాగేశ్వరరావు

పార్టీ తుని మండలాధ్యక్షుడిగా దుంగల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా గారా శ్రీనివాసరావు, రెడ్డి సూర్యారావు, జనరల్ సెక్రటరీలుగా అత్తి వెంకటరమణ, కిల్లాడ గోవిందు, జక్కన రామచంద్రరావు, సెక్రటరీలుగా ముప్పిడి సత్యవతి, దాడాల గంగాధర్, అన్నందేవర కల్యాణి, నవుడు గౌరీలక్ష్మి, గోసుల కృష్ణ, ట్రెజరర్‌గా నడిగట్ల అనిల్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా డొంకా వెంకటలక్ష్మి, సీలి యర్రయ్యమ్మ, తమరాన సావిత్రి, వడ్లమూర్తి రాజుబాబు, గంటా అప్పన్న, పదిలం నాగన్నదొర, పెంటపాటి వెంకట గంగాధర్ గణేష్, సుర్ల గంగతల్లి, సలాది సత్యనారాయణ, గుడపర్తి దేవుడమ్మ, పెదకాపు చంటిబాబు, మజ్జూరి సురేష్, మడగల రమణ, కొప్పినీడు సూర్యనారాయణ, సప్పా శ్రీను గా నియమితులయ్యారు.

తుని పట్టణాధ్యక్షుడిగా రమణాగౌడ్

పార్టీ తుని పట్టణాధ్యక్షుడిగా రేలంగి రమణాగౌడ్, వైస్ ప్రెసిడెంట్లుగా బోడపాటి శ్రీనివాస్, నార్ల రత్నాజీ, జనరల్ సెక్రటరీలుగా పామర్తి రమణ, తృహాడి శంకరరావు, కలం దివాణం, సెక్రటరీలుగా అన్నిశెట్టి నాగిరెడ్డి, దందా పుష్పమ్మ, కన్నూరి శ్రీనివాసరావు, దండెం నాగు, కుడగుల లూక్‌సుధీర్‌కుమార్, మంతెన గోవిందరాజులు, మర్రా విజయ, తేజోమూర్తుల శ్రీదేవి, చింతల శ్రీనివాస్, కోరుమిల్లి చిన్న, ట్రెజరర్‌గా బుడ్డిగ గణేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బోడపాటి సతీష్, మద్దాల కరుణాసాగర్, మేల బుజ్జి, సరోజిని, ఎస్‌కే ఖలీల్, దల్లి శ్యామ్, తల్లకొట్టు నారాయణ, తిరుమలనీడి రాజు, చింతంనీడి జోగారావు, రాసబోయిన జీవరత్నం నియమితులయ్యారు.

వెంకన్నకు ఆలయానికి పోటెత్తిన భక్తులు

గోకవరం: మండలంలోని తంటికొండ వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయం వద్ద స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాల్గోరోజు శనివారం పండితులు సామివారికి సుదర్శనాభిషేకాలు, సుదర్శన హోమం, విశేష పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువ నాయకుడు తోట రాంజీ స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ గండి వెంకటలక్ష్మికుమార్ ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వెంకన్న దర్శనానికి భక్తుల తాకిడి

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి తరలివచ్చి జీయ్యన్న, వేంకటేశ్వర స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రత్నగిరిపై 22న సరస్వతీ పూజ

అన్నవరం: స్థానిక వీరవెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో ఈ నెల 22న సరస్వతీ పూజ నిర్వహించి విద్యార్థులకు సత్యకలములు, కంకణాలు బహూకరించనున్నట్లు ఆలయ అధికారులు శనివారం తెలిపారు. అన్నవరం, పరిసర గ్రామాల విద్యార్థులు ఈ పూజల్లో పాల్గొనాలని కోరారు.

ఘనంగా భీష్మాష్టమి వేడుకలు

గండేపల్లి: నియోజకవర్గవ్యాప్తంగా భీష్మాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పండితులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని మల్లేపల్లి, గండేపల్లి, ఉప్పలపాడు, యల్లమిల్లి, పి.నాయకంపల్లి, జెడ్.రాగంపేట గ్రామాల్లో ఆలయాల్లో భక్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తాళ్లూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు మహాభారతంలో భీష్ముడి పాత్రను అర్చకులు వివరించారు.

ఉద్యోగుల ధర్నా

జగ్గంపేట: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల యూనియన్ నాయకుడు వీవీవీ కృష్ణ మాట్లాడుతూ పీఆర్సీ ప్రకారం ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.7500 కోట్లు తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పలువురు యూనియన్ నేతలు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ప్రతి కుటుంబానికీ లబ్ధి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు
- చినశంకర్లపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం



చినశంకర్లపూడిలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న వరుపుల సుబ్బారావు

ప్రత్తిపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరుతోందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని చినశంకర్లపూడిలో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, వంగవీటి రంగా విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలపై మహిళలను ఆరా తీశారు. తమకు సమయానికి ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయంటూ మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను 100 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తమ ప్రభుత్వంలో కులమతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. ప్రస్తుతం అమలు అవుతున్న సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, గ్రామ సర్పంచ్ ఏపూరి రామారావు, ఎంపీటీసీలు పిల్లా చిన్న, తటవర్తి రామన్నదొర, అన్నవరం ట్రస్ట్‌బోర్డు మెంబర్ దోచిట్టిబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, పార్టీ నాయకులు బెహరా దొరబాబు, మామిడి నరసింహమూర్తి, దాడిశెట్టి చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

సుగంధ మొక్కల పెంపకంపై అవగాహన



తుని శ్రీప్రకాష్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

తుని: స్థానిక ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో శనివారం రైతులు, విద్యార్థులకు సుగంధ మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. కేంద్రియ ఔషధ, సుగంధ మొక్కల పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ జీడీ కిరణ్ బాబు, డాక్టర్ కోటేశ్ కుమార్, డాక్టర్ కెవీఎస్‌ఎస్ శ్రీనివాస్ తదితరులు రైతులకు, విద్యార్థులకు సుగంధ మొక్కల పెంపకం, ప్రాథమిక ప్రాసెసింగ్, నాణ్యత, మార్కెటింగ్‌పై తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త కిరణ్‌బాబు మాట్లాడుతూ సుగంధ మొక్కల పెంపకంతో రైతులు చక్కని ఆదాయ పొందవచ్చన్నారు. ఔషధాల తయారీలో సుగంధ మొక్కల నూనెను వినియోగిస్తారన్నారు. కొబ్బరి తోటల్లో అంతర పంటగా దీనిని సాగు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సొసైటీ అధ్యక్షుడు కంటిపూడి నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆ స్థానాల్లో మాదిగలకు అవకాశం కల్పించాలి



తునిలో సమావేశమైన ఎమ్మార్పీఎస్ నాయకులు

తుని: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్ ఉన్న నియోజకవర్గాల్లో మాదిగలకు అవకాశం కల్పించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రవి అనంత్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక మార్కెట్ యార్డ్‌లో శనివారం ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు పలివెల శివమణి అధ్యక్షతన ఏపీ ఎమ్మార్పీఎస్ ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లో సమాన నిష్పత్తి ప్రకారం మాదిగలకు ఎమ్మెల్యే అభ్యర్థులుగా అవకాశం ఇవ్వాలన్నారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇచ్చిన పార్టీలకు ఎమ్మార్పీఎస్ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మందపల్లి సత్యన్న, దూలపల్లి చిన్న, పలివెల సతీష్, కాకాడ జ్యోతికుమార్ తదితరులు పాల్గొన్నారు.